

పాఠశాలల సమయపాలన ఇలా...

ఏసీసీ, జూన్ 11: వేసవి సెలవుల అనంతరం బుధవారం నుంచి పాఠ శాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకే ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాలలు సాయంత్రం 4 గంటల వరకుప్రాథమికోన్నత పాఠశాలలు 4.15 గంటల వరకు నిర్వహిస్తారు. హైస్కూళ్లు మాత్రం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

హాజీపూర్, జూన్ 11: రాపల్లి, నరసింగాపూర్ గ్రామాల్లో మంగళవారం హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎఫ్‌పీసీ సలహాదారుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతులు తమ అవసరాల నిమిత్తం 10 నుంచి 20 గుంటల వరకు సేంద్రియ వ్యవసాయంలో వరి, ఇంటి అవసరాల నిమిత్తం ఒక గుంటలో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని చెప్పారు. ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొడ్డు శంకర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చే రైతులకు ఆవుమూత్రం, పేడ అందిస్తామని తెలిపారు. రసాయన మందులు వాడడం వల్ల భూమి, వాతావరణం కలుషితం అవుతుందన్నారు. అనంతరం సేంద్రియ వ్యవసాయంపై ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతిభా అవార్డు అందుకున్న విద్యార్థి

జన్నారం, జూన్ 11: కిష్టాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి రాథోడ్ ఈశ్వర్ పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించగా సోమవారం హైద్రాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా అవార్డును అందుకున్నాడు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రితో ముఖాముఖి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, విద్యార్థి తండ్రి సంజీవ్‌కుమార్‌లను సత్కరించారు.



ముఖ్యమంత్రితో విద్యార్థి ఈశ్వర్

వార్డు సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వార్డు ప్రతినిధులు

బెల్లంపల్లి, జూన్ 11: పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీ వార్డు సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌కు వార్డు ప్రతినిధులు కొలిపాక శ్రీనివాస్, కొండబత్తిని రామ్మోహన్ వినతిపత్రం అందించారు. వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేక బురద నీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన వస్తుందని, ప్రజలు దారులను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో ఇరుకుగా మారాయని, కనీసం వాహనాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాజేశం, కార్తీక్, నాగభూషణం పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



వేమనపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

వేమనపల్లి, జూన్ 11: వేమనపల్లి, దస్నాపూర్, గొర్లపల్లి గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం అంబుడ్స్‌మెన్ శివరాం, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, నీరు పోయాలన్నారు. హరితహారానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, కార్యదర్శులు యాసఫ్, శ్యామ్‌చంద్, సహాయకులు కృష్ణమోహన్, శ్రీనివాస్, లక్ష్మణ్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

హాజీపూర్, జూన్ 11: దొనబండ గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకట కృష్ణ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతనితో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 2010-11 పదో తరగతి మిత్రులు మంగళవారం కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు వెంకటకృష్ణ కుటుంబానికి రూ.28 వేల ఆర్థిక సహాయం అందించారు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. మిత్రులు రాకేష్, లక్ష్మణ్, శరత్,మదుకర్, భాస్కర్, భీమేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడికి రిటైర్మెంట్ గ్రాట్యూటీ చెల్లింపు



గ్రాట్యూటీ చెక్కును అందజేస్తున్న ఆలయ ఈఓ

దండేపల్లి, జూన్ 11: గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో మునవాల సత్యనారాయణస్వామి అర్చకుడు ఇటీవల పదవీ విరమణ చేయగా రూ.2లక్షల గ్రాట్యూటీ చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ అందజేశారు. ఆలయంలో 29 సంవత్సరాలుగా అర్చకులుగా పని చేసి రిటైరయ్యారు. ముఖ్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, అర్చకులు జయస్వామి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌తో కలిసి చెక్కు అందజేశారు.

రేపు ఎన్‌హెచ్‌ఎం ఇంటర్వ్యూలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 11 : జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది ఒప్పంద పొరుగు సేవల పద్ధతిన పోస్టుల సంబంధిత మెరిట్, ఎంపిక జాబితాను జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నాయని డీఎంహెచ్‌వో అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

సెలవులకు స్వస్తి పుస్తకాలతో కుస్తీ



వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దాదాపు 48 రోజుల అనంతరం విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఆటాపాటలు, షికార్లతో గడిపిన విద్యార్థులు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు సెలవుల్లో బడిబాట నిర్వహించారు. ప్రభుత్వం కల్పించే వసతులు, బోధన, గతేడాది వచ్చిన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా బడిబాట చేపట్టారు.

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- బడిబాట ద్వారా అడ్మిషన్‌లు పెంచేందుకు కృషి
- ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పంపిణీకి ఏర్పాట్లు
- ఇంగ్లీష్ మీడియంతో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన

ఏసీసీ, జూన్ 11: వేసవి సెలవుల అనంతరం బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని బ్యానర్లు, కరపత్రాల ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా జరిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ప్రచారం చేశారు.

ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3,04,310 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా జిల్లాకు ఇప్పటి వరకు 2,97,995 పాఠ్య పుస్తకాలు అందాయి. వీటితో పాటు నోట్‌బుక్‌లు 2,59,446, వర్క్‌బుక్‌లు 46,114 జిల్లాకు వచ్చాయి. వీటిని ఆయా మండలాల విద్యాశాఖ అధికారుల ద్వారా పాఠశాలలకు చేరవేశారు. జిల్లాలో 43,714 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాల్సి ఉండగా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.



ఎంఈవోలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఈవో

జిల్లాలోని పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ, కేజీబీవీ, మైనార్టీ సంక్షేమ శాఖ, గురుకులాలు, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు మొత్తం జిల్లాలో 852 ఉన్నాయి. బాలురు 31,055 బాలికలు 31,535, మొత్తం 62,590 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 55,520 మంది అడ్మిషన్లు పొందారు. బడిబాట కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి కొత్త అడ్మిషన్‌ల ద్వారా విద్యార్థులను చేర్పించారు. ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన ద్వారా ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందించేందుకు కృషి చేస్తున్నారు.

బోధనేతర సిబ్బంది కొరత

పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అనేక పాఠశాలల్లో స్వీపర్, అటెండర్, వాచ్‌మెన్, స్కావెంజర్లు లేక పారిశుధ్య నిర్వహణ, భద్రత లోపాలు కనిపిస్తున్నాయి. అనేక చోట్ల ఉపాధ్యాయులే తలా కొంత వేసుకుని తాత్కాలికంగా స్వీపర్లను, స్కావెంజర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

టీచర్ల ప్రమోషన్‌లు, ట్రాన్స్‌ఫర్‌లు కొనసాగుతున్నందున అవసరమైన మేరకు బోధన సిబ్బంది అన్ని పాఠశాలల్లో అందుబాటులోకి వస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. బదిలీ ప్రక్రియ ఈనెల 22వ తేదీ వరకు పూర్తి అయ్యే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. ఈ సంవత్సరం పాఠశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లునిర్మించడంతోపాటు భవనాలకు మరమ్మతులు చేయించాం. క్లాస్‌రూంలలో డిజిటల్ తరగతుల కోసం ప్యానల్స్ కూడా ఏర్పాటు చేశారు. అన్ని పాఠశాలల్లో బోధన సిబ్బంది అందుబాటులోకి రానున్నారు. పాఠశాలల్లో అర్హత కలిగి శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన జరుగుతుంది. పిల్లలను అందరు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి.

జిల్లా అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

స్థాయీ సంఘాల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 11: అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లా అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సీఈవో గణపతితో కలిసి స్థాయి కమిటీ సమావేశాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళ, శిశు సంక్షేమం, పౌరసరఫరాల శాఖ, మిషన్ భగీరథ, రహదారులు, నీటి పారుదల తదితర అంశాలపై సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై జడ్పీటీసీలు అధికారులను నిలదీశారు. లక్షెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా సీఎంఆర్ బియ్యంలో అవకతవకలు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని వ్యవసాయాధికారులను నిలదీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. సదరం శిబిరాల్లో వైకల్యం ఉన్నా 25 శాతానికి మించి వేయడం లేదన్నారు. ర్యాలీ గడ్పూర్ ఆదివాసీ గూడాల్లో పోడు భూములకు సంబంధించి న్యాయం చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. పశు వైద్య రంగానికి సంబంధించి జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ మాట్లాడుతూ పశువులకు వచ్చే లంపిస్కిన్ వ్యాధిని నివారించేందుకు వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో మత్స్యశాఖ అధికారులు చేపల పెంపకంపై ప్రణాళికబద్ధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మత్స్యకారులకు తోడ్పాడునందించాలన్నారు. బెల్లంపల్లిలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని అందుబాటులోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. వేమనపల్లి జెడ్పీటీసీ స్వర్ణలత, హాజీపూర్ జెడ్పీటీసీ శిల్పలు మాట్లాడుతూ విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇంటర్ కళాశాలల కోసం మంజూరైన భవనాలను త్వరగా నిర్మించాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ, సూపరిండెంటెంట్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బాల కిషన్‌రావు, శ్రీనివాస్, సుమిత్, వెంకటేష్, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

-వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో వైద్యాధికారులు మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు.

పాఠశాలలను పర్యవేక్షించాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బెల్లంపల్లి, జూన్ 11 : పాఠశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలపై పర్యవేక్షణ చేయాలని మంగళవారం దుగ్నేపల్లి గ్రామస్థులు ఎంఈవో మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గతేడాది దుగ్నేపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించ లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దుగ్నేపల్లి పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బానయ్య, శ్రీనివాస్, విజయ్, కోట వెంకటస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

ఏసీసీ, జూన్ 11: పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని విద్యార్థి నాయకుడు మేకల అక్షయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మంత్రి లేనందున విద్యావ్యవస్థ కుంటు పడుతుందన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీకాంత్, మల్లికార్జున్, భూమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మందమర్రిరూరల్, జూన్ 11 : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పొన్నారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తమూర్తి కోరారు. మంగళవారం బడిబాట నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. సంకె శ్రీనివాస్, విజయలక్ష్మీ, సంపత్, లింగయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూప్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొల్పాలి

ఏసీసీ, జూన్ 11: పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా బుధవారం పాఠశాలలను అలంకరించి పండగ వాతావరణం నెలకొల్పాలని డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను, అమ్మ ఆదర్శ కమిటీలను, ఆహ్వానించాలన్నారు. ప్రజాప్రతినిధులతో యూనిఫాంలు, పుస్తకాలు అందించాలన్నారు.

డిపెండెంట్ల వయోపరిమితి పెంపు

- 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు
- తక్షణమే లబ్ధిపొందనున్న 300 మంది
- కారుణ్య నియామకాలకు మాత్రమే
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

శ్రీరాంపూర్, జూన్ 11 : సింగరేణిలో కారుణ్య నియామకాలలో అభ్యర్థుల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మం గళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కారుణ్య నియామకాలు పొందే అభ్యర్థుల వయస్సు 35 ఏళ్లుగా ఉండేదన్నారు. దశాబ్దకాలంగా వంద లాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను అం దుకోలేకపోయారని, కరోనా కారణంగా రెండేళ్లపాటు మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో చాలా మం దికి వయసు మించి పోయిందన్నారు. సవరింపుతో చాలా మందికి మేలు జరుగుతుందన్నారు. అన్ని యూనియన్ల నాయకులు, డిపెండెంట్ల కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు డైరెక్టర్ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2018 మార్చి 9వ తేదీ నుంచి ఈ గరిష్ఠ వయోపరిమితిని వర్తింప జేస్తున్నామని, దీనివల్ల తక్షణమే 300 మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క సింగరేణి అభ్యర్థులకు హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందించే సమయంలో వయో పరిమితి గురించి ఆదేశించారన్నారు. వారి ఆదేశాల మేరకు బోర్డు సమావేశంలో 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వివరిం చారు. సవరించిన ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాల్లో అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. గతంలో ఏకమొత్తంలో డబ్బులు తీసు కున్న వారుగానీ, నెల నెలా డబ్బులు తీసుకుం టున్న వారుగానీ, ఇతర వారసులు ఉద్యోగం పొందిన వారు దీనికి అర్హులు కాదని తెలిపారు.



నియామకపత్రం అందిస్తున్న సీఎం(ఫైల్)

ముగిసిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు

ఏసీసీ, జూన్ 11: జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో జిల్లా నృత్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, మున్నూరు కాపు సంఘం నాయకులు లక్ష్మణ్ పటేల్, టీపీసీసీ సభ్యుడు చిలువేరు శంకర్‌లు హాజరై విజేతలకు బహుమతులు అందించారు. పోటీల్లో శాస్త్రీయ నృత్యం సీనియర్ విభాగంలో వెన్నెల లాస్య గ్రూపు మొదటి స్థానంలో నిలువగా, శ్రీనిధి నృత్యాలయం గ్రూపు రెండో స్థానంలో నిలిచింది. జానపద విభాగంలో ప్రశాంత్ గ్రూపు మొదటి స్థానంలో నిలువగా వర్షిని గ్రూపు రెండో స్థానంలో నిలిచింది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వంగళ శ్రీధర్ మాస్టర్, డాక్టర్ రంగ జ్యోతిలు వ్యవహరించారు. కిషన్, రవీందర్, సంతోష్, మదుకర్, డ్యాన్సమాస్టర్ లక్ష్మణ్, అర్జున్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి



కమిషనర్ సతీష్‌కు వినతిపత్రం ఇస్తున్న బిల్ కలెక్టర్లు

నస్పూర్, జూన్ 11: నస్పూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న బిల్ కలె క్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు పెంచాలని మంగళవారం కమిష నర్ సతీష్, చైర్మన్ వేణులకు వినతిపత్రాలు అందజేశారు. తక్కువ వేత నాలతో పని చేస్తున్నామని వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బిల్లు కలెక్టర్లు, ఆపరేటర్లు మోహన్, సీపతి సురేష్ కుమార్, గోపాల్, సంపత్ కుమార్, శ్రీకాంత్, సతీష్, రామకృష్ణపాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులు

ఏసీసీ, జూన్ 11 : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజు రోజుకు పెరుగుతుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెలలో 50,937 మంది ఆన్‌లైన్ ద్వారా రూ.8.64 కోట్లను చెల్లించారని, ప్రతీ నెల 20 శాతం ఆన్‌లైన్ చెల్లింపులు పెరుగుతున్నాయన్నారు. గంటల తరబడి లైన్‌లలో నిల్చుని బిల్లులు చెల్లించక్కర్లేదన్నారు.

వరి కొయ్యలు కాల్చడంలో జాగ్రత్త

● అప్రమత్తత లేకపోతే ప్రమాదం



దండేపల్లి, జూన్ 11: వరికోతల అనంతరం కొయ్యలను కాల్చే సమయంలో రైతులు ఏమాత్రం ఆదమరిచినా పెను ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. కోతలు పూర్తయిన తర్వాత పంట భూముల్లో మిగిలిన కొయ్యకాళ్లను కాల్చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొయ్యలను కాల్చే సమయంలో వీచే గాలులకు మంటలు ఎగిసిపడుతాయి. కొన్నిసార్లు మన చుట్టూ ఉవ్వెత్తున ఎగిసిపడే మంటల మధ్యలో చిక్కుకొని ప్రాణాలు పోయే అవకాశం ఉంది. గడ్డివాములకు మంటలు అంటుకొని బూడిదవుతాయి.

●● రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవి..

- వరి కొయ్యకాళ్లను తగులబెట్టే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి.
- గాలి వీచే సమయంలో కాల్చరాదు.
- కొయ్యలను కాల్చేముందు పొలం గట్లకు కొద్ది దూరం వరకు ఎండుగడ్డిని పూర్తిగా తొలగించాలి.
- మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా ముందుగానే పొలం చుట్టు నీళ్ల చల్లుకోవాలి.
- మంటలు వ్యాపిస్తే ఆర్పేందుకు ముందుజాగ్రత్తగా బకెట్లలో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- మంటలు చెలరేగితే చెట్ల కొమ్మలు, నీళ్లతో ఆర్పేయాలి.
- పొలానికి నలు వైపులా మంటలను అదుపు చేసేందుకు మనుషులు ఉంచుకుంటే అదుపు చేయవచ్చు ఈ జాగ్రత్తలు తప్పని సరిగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

భూమిలోనే కలియ దున్నితే పంటలకు ఎంతో మేలు

వరి కొయ్యలను కలియదున్నితే భూసారం పెరిగి ఆశించిన దిగుబడి వస్తుంది. ఇందు కోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. వరి కొయ్యలకు నిప్పు పెడుతుండటంతో భూసారం తగ్గుతుంది.

●● వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలు..

- వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది.
- నత్రజని ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంట దిగుబడి పడిపోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- నేలకు మేలు చేసే క్రిమి కీటకాలు నశిస్తాయి.
- నేలలో గడ్డిని కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- వరి కొయ్యలు కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5 నుంచి 10శాతం పెరిగే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.

వరి కొయ్యలను భూమిలో దున్నితే లాభం

గొర్ల అంజీత్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారి..

భూమిలో పంట అవశేషాలను కలియదున్ని ఎకరాకు మూడు బస్తాల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. రైతులకు అవగాహన లేక వారి పంట పొలాల్లో కొయ్యలను కాలుస్తుండడంతో నష్టం వాటిల్లుతుంది.

నల్లబ్యాడ్జీలతో నిరసన



చెన్నూరు, జూన్ 11: మహబూబాబాద్ జిల్లాలో జీలుగ విత్తనాల పంపిణీలో అక్రమాలు జరిగాయని ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కిష్టంపేట రైతువేదిక వద్ద ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని విడిచి పెట్టి సంబంధం లేని ఏఈవోలను సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

విద్యాహక్కు చట్టం అమలయ్యేనా..?

● అమలుకాని 2009 చట్టం ● ఉచిత విద్యకు నోచుకోని పేద విద్యార్థులు ● ప్రైవేటు బడుల్లో అమలుగాని 25 శాతం రిజర్వేషన్

మంచిర్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకాకపోవడంతో ప్రత్యేక విభాగాలకు చెందిన విద్యార్థులు నష్టపోతున్నారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా ఉచిత, నిర్బంధ విద్య అమలు చేయాల్సి ఉంది. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (1 నుంచి 8 తరగతులు)ను ఉచితంగా అభ్యసించే హక్కును కల్పించింది. ఎలిమెంటరీ విద్యను అభ్యసించకుంటే ప్రాథమిక విద్య చదవాల్సిన అవసరం లేకుండానే విద్యార్థి తన వయస్సుకు సరిపడా తరగతిలో చేరే అవకాశాన్ని ఆర్టికల్ 21ఏ కల్పించింది.

అమలుకాని విద్యాహక్కు చట్టం

ఎలిమెంటరీ స్థాయిలో పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అమలు చేసేందుకు 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టం రూపొందించింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు విద్యాహక్కు చట్టం అమలు చేయాల్సి ఉంది. అయితే తెలంగాణలో ఈ చట్టం అమలుకు నోచుకోకపోవడంతోపాటు ఆదిలోనే చట్టం నిర్వీర్యం అయింది. ప్రభుత్వాల వైఖరి కారణంగా ప్రత్యేక అర్హతలు గల విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాన్ని విస్మరించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ అమలు కాలేదు. విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం పిల్లలను చేర్చుకోవడంలో ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రత్యేక పాఠశాలలు 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. చట్టం ప్రకారం అనాథలు, దివ్యాంగ పిల్లలు, హెచ్ఐవీ సోకిన పిల్లలకు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యలో 5 శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉండగా, షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ)కు 10 శాతం, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)లకు 4 శాతం, బలహీన వర్గాలు (బీసీ), మైనారిటీలకు- 6 శాతం ఉచితంగా విద్యను బోధించాల్సి ఉంది.

ఉచిత విద్యకు ప్రైవేటు విద్యాసంస్థల వెనుకంజ

విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రత్యేక అర్హతలు గల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రైవేటు యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలు వెనుకంజ వేస్తున్నాయి. బడ్జెట్ పాఠశాలలను మినహాయిస్తే ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్న కార్పొరేట్, ఇతర ప్రైవేటు విద్యాసంస్థలు చట్టాన్ని తుంగలో తొక్కడమేగాకుండా, ప్రశ్నించిన వారికి అడ్మిషన్లు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లాలో 200 వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉండగా, పదుల సంఖ్యలో కార్పొరేట్ విద్యా సంస్థలు పని చేస్తున్నాయి. అన్ని ప్రైవేటు విద్యాలయాల్లో కలిపి దాదాపు 60వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయా పాఠశాలల్లో ఎక్కడ కూడా విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా విద్యాహక్కు చట్టం అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే విద్యాహక్కు చట్టం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడితే ప్రత్యేక అర్హతలుగల విద్యార్థులకు మేలు చేకూర్చినట్లు అవుతుంది.

అమలుకావడం లేదు : డీఈవో

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, విద్యాలయాల్లో 25 శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉంది. రాష్ట్రంలో ఈ చట్టం ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో కూడా 25 శాతం నిబంధన ప్రస్తుతానికి అమలు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే జిల్లాలో కూడా తప్పనిసరిగా చట్టం అమలు చేయడం జరుగుతుంది.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 11 : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత గల షెడ్యూల్డ్ కులముల విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో షెడ్యూల్డు కులముల అభివృద్ధి ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి లక్కీడ్రా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1వ తరగతిలో ప్రవేశాలకు 154 మంది దరఖాస్తులు చేసుకోగా లక్కీడ్రా ద్వారా 92 మందిని, 5వ తరగతిలో 160 మంది దరఖాస్తు చేసుకోగా 91 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లక్కీడ్రా తీస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

వడదెబ్బతో యువకుడి మృతి

మందమర్రిరూరల్, జూన్ 11: సారంగపల్లి పంచాయతీలోని తుర్కపల్లికి చెందిన రేచవేని రాజ్‌కుమార్ (30) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం రాజ్ కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



రాజ్‌కుమార్ (ఫైల్)

తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల

ఏసీసీ, జూన్ 11 : స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్‌ల తాత్కాలిక సీనియారిటీ జాబితా, ఖాళీల వివరాలను విడుదల చేసినట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు www.deomnlts.weebly.comలో జాబితాను చూసుకోవచ్చన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం 4 గంటలలోగా సంబంధిత ఆధారాలతో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల ఇంటింటా ప్రచారం

దండేపల్లి, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకోవడానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గ్రామాల్లో తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల పోటీతో మనుగడ కోల్పోతున్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు కూడా బడిబాట పేరుతో ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీ కరపత్రాలు ముద్రించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనం, ఆంగ్ల మాధ్యమం, గ్రంథాలయం, కంప్యూటర్ విద్య, పాఠశాలలో చక్కటి చదువుతోపాటు మంచి ఫలితాలు సాధిస్తున్నామని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయలు ప్రచారం చేస్తున్నారు. బడిబాటలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జూన్ 11 : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఢిల్లీలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుటుంబ సమేతంగా కలిశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కుటుంబ సభ్యులందరం కృషి చేశామని ఖర్గేకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మెరుగైన సీట్లు సాధించినందుకు ఖర్గేకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థినికి సన్మానం

తాండూర్, జూన్ 11 : తాండూర్ కస్తూర్బా విద్యాలయానికి చెందిన దుర్గం మమత ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు , జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు మల్లయ్య భట్టు తన కార్యాలయంలో విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జేడీ రాజీవ్, కేజీబీవీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ హజారీ శిరీష, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సుమన చైతన్య, మనీషా, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు

ఆంక్షలు ఎత్తివేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న భూమాచారి

జన్నారం, జూన్ 11: కవ్వాల్ అభయారణ్యంలో అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం పట్టణానికి చెందిన సామాజిక వేత్త భూమాచారి మంగళవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఫ్లెక్సీ పట్టుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అటవీ ఆంక్షలు ఎత్తివేసే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. ఆంక్షలతో భారీ వాహనాలు మండలానికి రాక నష్టపోతున్నామని, మండలం అభివృద్ధి జరగడం లేదన్నారు. వెంటనే ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ

కెరమెరి, జూన్ 11: మృగశిరకార్తె తొలకరివానాలు కురవడంతో గ్రామాల్లో రైతులు పంటచేనుల్లో బిజీఅయ్యారు. చేనులో ఎండిన పత్తి, కంది కర్రలు తొలగించి కాల్చివేస్తున్నారు. అలాగే భూమిని దున్నడం, చదును చేసి పత్తివిత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా 8210మంది రైతులు సుమారు 30వేల ఎకరాల్లో పత్తి, కంది, పెసర పంటలు సాగుచేయనున్నారు. వర్షాలు కురియగానే విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకుం టున్నారు.

పోతరాజు ఆలయంలో విత్తన పూజ..

గిరిజనుల ఆరాధ్యదైవమైన పోతరాజు ఆలయంలో మంగళవారం శివగూడ, ధనోర, కోలాంగూడ, బాబేఝరి, ఇందాపూర్ గ్రామాల ప్రజలు విత్తనాలను తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసిసంవృద్ధిగా పంటలుపండాలనిమొక్కులు చెల్లించుకున్నారు.



పోతరాజు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రైతులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్‌కు సన్మానం

వాంకిడి, జూన్ 11: జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మండల కేంద్రానికి చెందిన విద్యార్థి దుర్గం అర్జున్‌ను లక్ష్మణ్ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ర్యాంకు సాధించడం అభినందనీయమని సంస్థ చైర్మన్ గాదే అవినాష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చదువుల ఖర్చుల కోసం రూ.6200 ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్ గాదె అనిల్‌కుమార్, బౌద్ధమహాసభ అధ్యక్షుడు అవోక్, దౌలత్‌కుమార్, అరుణ్, పింకు, ఇంద్రజిత్, రాకేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి అర్జున్‌ను సన్మానిస్తున్న సేవా సదన్ సభ్యులు

కోల్ ఇండియా మాదిరిగా ఓపీడీ చార్జీలు చెల్లించాలి

శ్రీరాంపూర్, జూన్ 11: కోల్‌ఇండియా మాదిరిగా సింగరేణిలోనూ ఓపీడీచార్జీలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యుడు మందానర్సింహరావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒకపత్రికాప్రకటన విడుదల చేశారు. బొగ్గుగని కార్మికులకు, అధికారులకు ఓపీడీ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం గతంలో 300ల రూపాయలు ఉండగా, దానిని 1200ల రూపాయలకు పెంచుతూ నిర్ణయించారన్నారు. కోల్ ఇండియాలో సీపీఆర్ఎంఎస్‌ఉన్న దంపతులకు ఒక్కొక్కరికి 25వేల రూపాయలు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను అగ్రిమెంట్ చేసుకున్నామని ప్రచారంచేసుకున్న సంఘాలు సింగరేణిలో అమలు చేయించడం లేదన్నారు. యాజమాన్యం స్పందించి రిటైర్డ్ కార్మికులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ 25వేల రూపాయలు ఇవ్వాలని కోరారు.

నారు సాగుతో ఆదర్శంగా నిలుస్తున్నరైతు

కెరమెరి, జూన్ 11: మండలంలోని సావర్‌ఖేడ గ్రామానికి చెందిన రైతు మోతీరాం వినూత్నంగా కూరగాయల నారు సాగుచేసి ఉపాధి పొందుతున్నాడు. తనకున్న అయిదు ఎకరాల చేనులో తన ఇద్దరు కుమారులకు రెండు ఎకరాల చొప్పున పంచి ఇచ్చాడు. మిగిలిన ఎకరంలో గతంలో ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, గుడిహత్నూర్ ప్రాంతాల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రైతులు నర్సరీలు ఏర్పాటు చేసి కూరగాయల మొక్కలు పెంచి అమ్మేవారు. గత సంవత్సరం వారి నర్సరీ నుంచి నారు కొనుగోలు చేసి తన చేనులో కూరగాయల సాగు చేసేవాడు. వారివద్ద నర్సరీకి సంబంధించిన వివరాలు సేకించి తనే స్వయంగా నర్సరీని ఏర్పాటు చేయాలన్న ఆలోచించాడు. దీంతో తన చేనులో ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నర్సరీ పనులు ప్రారంభించాడు. ఆసిఫాబాద్‌లో విత్తనాలు కొనుగోలుచేసి భూమిని చదును చేసి విత్తనాలు చల్లుకున్నాడు. ఆ తరువాత మొక్కలకు ఎండతగలకుండా చలవ పందిరి (గ్రీన్‌నెట్) ఏర్పాటు చేసి రోజుతప్పిరోజు క్రమం తప్పకుండా నీరుపట్టాడు. అలా తయారు అయిన నారును మేలో విక్రయాలు ప్రారంభించాడు. నారులో వంకాయ, మిరపకాయ, టమాట రకాలను ఎంచుకున్నాడు. వంకాయ నారు(ఒక్కోమొక్కకు) రూ.1, మిరపకాయ నారు(ఒక్కో మొక్కకు) రూ.4, టమాట నారు(ఒక్కో మొక్కకు) రూ.1 చొప్పున విక్రయించాడు. జూన్ చివరి వరకు నారు విక్రయాలు నడుస్తాయని రైతు పేర్కొంటున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వంకాయ నారు, మిరప నారు

తక్కువ సమయంలో ఆదాయం..
- మోతీరాం, రైతు

నారు తయారు చేసి విక్రయించడం ద్వారా తక్కువ సమయంలో మంచి లాభాలు వస్తున్నాయి. నేను ఇప్పటి వరకు మిరప, టమాట, వంకాయ నారు ద్వారా సుమారు రూ.70వేల రూపాయలు ఆర్జించాను.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 11: బడిబాటలో భాగంగా మండలంలోని మోతుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైనవిద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందుతాయని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. వారివెంట ఎంఈవో మనుకుమార్, సీఆర్పీ తిరుపతి, నాయకులు వినోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

ఆసిఫాబాద్, జూన్ 11: విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఇకపై గంటల తరబడి లైన్లలో నిరీక్షించే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా నిమిషాల వ్యవధిలో చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలపారు. కుమరంభీం ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్‌ద్వారా చెల్లింపులు ప్రతినెల 20శాతం పెరుగుతున్నాయన్నారు. టీజీఎస్పీడీసీఎల్ మొబైల్‌యాప్ ద్వారా నెలవారీ బిల్లులు గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్ చెల్లించవచ్చని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆసిఫాబాద్, జూన్ 11: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, థర్డ్‌పార్టీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు శ్రీశైలం, మల్లేష్, మురళీ, మమత, హరీష్, సత్తార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని రక్షించిన యువకుడు

ఆసిఫాబాద్, జూన్ 11: మండలంలోని మానిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో వ్యాపారి ఫయాజ్‌కు చెందిన ఫాంహౌజ్‌లోకి మంగళవారం చుక్కల దుప్పిని కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. ఆ సమయంలో అక్కడేఉన్న ఫయాజ్ కుమారుడు రహెమాన్ కుక్కల బారినుంచి దుప్పినిరక్షించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని దానికి ప్రథమ చికిత్సచేసి తిరిగి అడవిలోకి పంపించినట్లు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు.



యువకుడి సంరక్షణలో ఉన్న దుప్పి

అవార్డు గ్రహీతకు సన్మానం

ఆసిఫాబాద్, జూన్ 11: మహాత్మజ్యోతి బాపూలే అవార్డు గ్రహిత అవిడపు ప్రణయ్‌ని మంగళవారం హిందువాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్‌కు చెందిన ప్రణయ్ మహాత్మజ్యోతిబాపూలేఅవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

ఎస్‌బీఐ సీఎస్‌పీ నిర్వాహకుడిపై ఫిర్యాదు

కాగజ్‌నగర్, జూన్ 11: కాగజ్‌నగర్ ఎస్‌బీఐ సమీపంలోని కస్టమర్ సర్వీస్ పాయింట్(సీఎస్‌పీ)పై పలువురు వినియోగదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎస్‌పీ సెంటర్‌లో కొంతమంది వద్ద డబ్బులు తీసుకొని సంబంధిత ఖాతాల్లో జమ చేయటం లేదని బాధితులు సోమవారం రాత్రి సీఎస్‌పీ నిర్వాహకుడితో గొడవకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు సీఎస్‌పీ నిర్వాహకుడు రమేష్‌ను విచారిస్తున్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్ నియామకం

కాగజ్‌నగర్, జూన్ 11: కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్‌ను మంగళవారం నియమించారు. మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర-1కు షాగుఫ్తా ఫిర్దొస్, బాలుర-2కు వి సుచరిత మేరిని నియమించారు. ఈ మేరకు మైనార్టీ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్ సెక్రెటరీ ఐషా మస్రత్ ఖానం ఉత్తర్వులను జారీ చేశారు.



మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 11: పొదుపు సంఘాల గ్రూపు మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని రహపల్లి గ్రామంలో మహిళా సంఘాల గ్రూపులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బ్యాంకు వారు అందించే రుణాలు తీసుకున్న వాటిని సకాలంలో చెల్లించి మళ్లీరుణాలు పొందాలన్నారు. ఆయనవెంట ఏపీఎం శ్రీనివాస్, సత్యనారాయణ, నాయకులు పెంటయ్య, మధుకర్, గణేష్ తదితరలు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్, జూన్ 11: ఈనెల12న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఉదయం 9.45గంటలకు ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి హైలెవల్‌బ్రిడ్జి సందర్శించి 10.40కి వాడిగూడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నతపాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీచేసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతారని తెలిపారు. 11.55గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి సాయంత్రం 3.15గంటలకు వాంకిడి మండలం సవ్వాతి గ్రామప్రజలతో చర్చిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులు ప్రగతినివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు.

మిషన్ భగీరథ నల్లాలపై ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో, కార్యదర్శులు

సిర్పూర్(టి), జూన్ 11: మండలంలోని డోర్‌పల్లి, పారిగాం, టోంకిని, కొమ్ముగూడ, లక్ష్మీపూర్ తదితరగ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీకార్యదర్శులు పహీంభాను, స్రవంతి మిషన్ భగీరథ నల్లాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమం అన్నిగ్రామాల్లో దశల వారీగా జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

మిషన్ భగీరథ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

కెరమెరి, జూన్ 11: కొన్ని రోజులుగా మండలవ్యాప్తంగా కొనసాగుతున్న మిషన్‌భగీరథ ఇంటింటి సర్వేను మంగళవారం ఎంపీడీవో అంజద్‌పాషా పరిశీలించారు. మండలంలోని రింగన్ ఘాట్, కోటారి, పార్డి, ధనోర గ్రామాల్లో చేపడుతున్న సర్వేను పరిశీ లించి ప్రజలకు నీరు అందుతుందా లేదా అని ఆరాతీశారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఈశ్వర్, సరిత, బొజ్జిరావు, అంబారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సదరం వైద్య శిబిరాలు

ఆసిఫాబాద్, జూన్ 11: దివ్యాంగులకు ఈనెలలో సదరం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగత్వాల వారీగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి హాజరవడానికి ముందు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో వికలాంగత్వం పరీక్ష చేయించుకొని స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల15న మూగ, చెవిటి, మానసిక వైకల్యం, 18న కంటిచూపు, 25న ఎముల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు తమవెంట వికలాంగత్వ ఆరోగ్య పరీక్ష చేయించుకున్న పత్రాలతో రావాలన్నారు.

జీరో బిల్లుల కోసం మహిళల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చిన మహిళలు

సిర్పూర్(టి), జూన్ 11: మండలంలోని పాతట్లగూడ, హీరాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన విద్యుత్ విని యోగదారులు జీరో బిల్లులు రావడం లేదని ఆరోపిస్తూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి తరలి వచ్చారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన సర్వేలో తాము పూర్తి వివరాలు ఇచ్చామన్నారు. 200యూనిట్ల లోపు ఉన్నా తమకు జీరో బిల్లులు ఇవ్వడం లేదని, తమకు జీరో బిల్లులు వచ్చేలా అధికారులు కృషి చేయా లని మహిళలు కోరారు.

తనిఖీలు నిలిపివేయాలి

పెంచికలపేట, జూన్ 11: ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు, ఆకస్మిక తనిఖీలు నిలిపివేయాలని మంగళవారం ఆర్ఎంపీ, పీఎంపీలు మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వ ర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా సేవలను గుర్తించి మాపై దాడులు, ఆకస్మిక తనిఖీలు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంపీలు వీరాచారి, సుధాకర్, శ్రీనివాస్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

బడికి వేళాయే!

- ఆట..పాటలకు..ఇక టాటా...
- ముగిసిన వేసవిసెలవులు
- నేటినుంచి పాఠశాలల పునఃప్రారంభం
- స్కూళ్లకు చేరిన పాఠ్యపుస్తకాలు



ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11: ఆటపాటలతో వేసవి సెలవులు సరదాగా గడిచి పోయాయి. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు నేటినుంచి పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, డ్రెస్సులు కొనుగోలులో తల్లిదండ్రులు బిజీగా ఉన్నారు. వేసవంతా బోసిపోయిన స్కూళ్ల సోమవారం పునఃప్రారంభంతో మళ్లీ కళకళలాడనున్నాయి. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల ఇబ్బందులు లేకుండా జిల్లా విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకుంది. పాఠ్యపుస్తకాలను ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసింది.



ఆసిఫాబాద్‌లోని ఓ పాఠశాలలో పూర్తికాని పనులు

అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు..

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా పాఠశాలల్లో సగం పను లు కూడా పూర్తికాలేదు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 426పాఠశాలల్లో పనులు చేపట్టారు. దీంట్లో కేవలం 220పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తికాగా మిగతా పాఠశాలల్లో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, తరగతిగదుల మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. మహిళా సమైఖ్య సభ్యుల ఆధ్వర్యంలో పనులు, పర్యవేక్షణను చేపట్టేందుకు నిర్ణయించింది. ఈ మేరకు 426 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు రూ.19.5కోట్ల నిధులు మంజూరయ్యాయి.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు, దుస్తులు..

ఏటా జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు గడిచినా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందని సందర్భాలే అనేకం ఉన్నాయి. అయితే ఈసారి పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ప్రభుత్వం ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను సరఫరా చేసింది. విద్యార్థుల ఏకరూప దుస్తుల కోసం 97,786మీటర్ల క్లాత్ రాగా వాటిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టించారు. ఈ మేరకు ఆయాపాఠశాలలకు దుస్తులను పంపించారు. అలాగే 3,71,967పాఠ్యపుస్తకాలు, 2,13,155నోట్‌బుక్‌లు జిల్లా కేంద్రానికి చేరుకోగా వాటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు.

జిల్లాలో 579 ప్రాథమిక పాఠశాలలు, 188 ప్రాథమికోన్నత పాఠశాలలు, 113 జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఇందులో 48,248 విద్యార్థులు చదువుకుంటున్నారు.

60శాతం పనులు పూర్తి..: అశోక్, డీఈవో



అమ్మఆదర్శ పాఠశాల పనులు 60 శాతం పూర్తయ్యాయి. జిల్లాలో 426 పాఠశాలలకు గాను 220 పాఠశాలల్లో పనులు పూర్తిచేశాం. మిగతా పాఠ శాలల్లో పనులు వేగిరపరిచి త్వరలోనే పూర్తిచేస్తాం. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను ఇదివరకే ఆయా పాఠశాలలకు పంపిణీ చేశాం.

పాఠశాలల మరమ్మతులు సత్వరమే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



పాఠశాలల్లో మూత్రశాలలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్/వాంకిడి, జూన్ 11: అమ్మఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామ పరిధిలోగల వాడిగూడ, ఈదులవాడ, వాంకిడి మండలంలోని ఘాట్‌జంగం, మడోకర్‌వాడ, గోయగాం పాఠశాలల్లో అమ్మఆదర్శ పాఠశాల క్రింద ప్రభుత్వం పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడంతో పాఠశాలల్లో మిగిలిఉన్న మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగు నీరు, విద్యుత్, టాయిలెట్లు, శానిటేషన్, ఫ్యాన్ల ఏర్పాటు వంటి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలల గదులు శుభ్రపర్చాలని, ఆవరణలో ఉన్న చెత్తను, శిథిలాలను తొలగించాలని తెలిపారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడంతో విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులు,పుస్తకాలు వెంటనే వారికి అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయం

బెజ్జూరు, జూన్ 11: మత్తుపదార్థాల నిర్మూలన ప్రభుత్వ ధ్యేయమని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి అన్నారు. మంగళవారం మండలంలోని సలుగుపల్లి గ్రామంలో గంజాయి, గుడుంబా, మత్తుపదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాల జోలికిపోవద్దని సూచించారు. గుడుంబా, గంజాయితో కుటుం బాలు చిన్నాభిన్నమవుతాయని అన్నారు. గుడుంబా, ఇతరమత్తుపదార్థాల విక్రయించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఎస్సై సురేష్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు

సేంద్రియ ఎరువులే వాడాలి

- కాగజ్‌నగర్ డివిజన్ వ్యవసాయాధికారి మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మనోహర్

సిర్పూర్(టి), జూన్ 11: రసాయనఎరువులకు బదులు సేంద్రియ ఎరువులనే వాడాలని కాగజ్‌నగర్ డివిజనల్ వ్యవసాయాధికారి మనోహర్ అన్నారు. మంగ ళవారం మండలంలోని రైతువేదికలో రైతులకు ఆన్‌లైన్‌ద్వారా పత్తివిత్తనాలు నాటే కొత్త పద్ధతులపై శాస్త్రవే త్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని, రసాయన ఎరువులతో పంటతోపాటు భూసారం దెబ్బ తింటుందన్నారు. కంపెనీకి చెందిన బ్రాండెడ్ పత్తివిత్త నాలనే నాటాలన్నారు. అలాగే రైతులు అంతరపంటల సాగుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు మధులత, రామకృష్ణ, డివిజన్‌లోని అన్ని మండలాల ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరిస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కృష్ణారావు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11: అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని ఇక ముందు ఇలానే కొనసాగితే సహించేది లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జడ్పీచైర్మన్ కృష్ణారావు అధ్యక్షతన స్థాయిసంఘాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలం, నియోజకవర్గంలో చేపడుతున్న పలుఅభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో అధి కారులు తమను విస్మరిస్తున్నారని అన్నారు. మనఊరు - మనబడి బిల్లుల రాక కాంట్రాక్టర్లు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాపరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు మాట్లాడుతూ మనఊరు మనబడి పాఠశా లలకు చెందిన బిల్లుల బడ్జెట్ విడుదల కాలేదన్నారు. ఆసిఫాబాద్ నుంచి అడ వైపు వెళ్లేమార్గంలో కుడికాలువ పైన రోడ్డు గుంతలమయంగా మారిందని వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అందవెల్లి వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని జడ్పీటీసీ శ్రీరాములు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పనులు చివరి దశలో ఉన్నాయని త్వరలోనే పూర్తి చేస్తామని ఈఈ పెద్దన్న తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు వైద్యులకు సకాలంలో వేతనాలు ఎందుకు ఇవ్వడంలేదని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువచ్చారు. సమా వేశంలో డిప్యూటీ సీఈవో లక్ష్మీనారయణ, డీఆర్డీవో సురేందర్, సీపీవో పాపయ్య, ఈఈలు ప్రభాకర్, గుణవంత్‌రావు, వెంకటపతి, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీ రమాదేవి, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు, జడ్పీటీసీలు అజయ్, ద్రుపదబాయి, పుష్పలత, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ తరగతులు పునఃప్రారంభించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 11: శిక్షణ తరగతులు పునఃప్రారంభించాలని మంగళవారం ఆర్ఎంపీ,పీఎంపీలు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఇన్‌చార్జి జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, డీఎంహెచ్‌వో తుకారాంభట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూగతంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణఇచ్చి సర్టిఫికేట్‌లు అందజేస్తామని తెలియజేశారని అన్నారు. కానీఇప్పటివరకు అమలు పర్చలేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ,పీఎంపీలు అజయ్‌కుమార్, మెహరాజ్ హుస్సేన్, రమేష్‌రూప్‌నార్, లక్ష్మణ్, జడ్పీటీసీలు అరిగెలనాగేశ్వర్‌రావు, టి.శ్రీరామరావు పాల్గొన్నారు.



సింగరేణి సూపర్‌బజార్‌లను ఆధునీకరించాలి

మందమర్రిటౌన్, జూన్ 11: సింగరేణిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సూపర్ బజార్‌లను ఆధునీకరించాలని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సూపర్‌బజార్‌లలో కొన్ని వస్తువులు దొరకడం లేదన్నారు. దీనివల్ల సింగరేణికి వచ్చే ఆదాయం ఇతరషాపులకు వెళ్తోందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సూపర్ బజార్‌లను అన్ని హంగులతో ఆధునీకరించాలన్నారు. ఈ విషయంపై త్వరలోనే సింగరేణి సీఎండీని కలిసి విన్నవిస్తామన్నారు. నాయకులు సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, యాకూబ్, రామస్వామి, సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: కార్మికుల సంక్షేమం కోసం నాణ్యమైన సరుకులను తక్కువ వ్యయంతో సింగరేణి కార్మికులకు అందించడంలో భాగంగా సూపర్ బజార్‌లను డీమార్టులుగా మార్చాలని మందమర్రి ఏరియా హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ బజార్‌లను మూసివేసే ప్రక్రియను ఆపి సూపర్ డీమార్టులను అందిస్తే సింగరేణి కార్మికులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పనిచేయని కంప్యూటర్‌లతో ఇబ్బందులు పడుతున్న క్లర్కులు

మందమర్రిటౌన్, జూన్ 11 : సింగరేణిలో పనిచేయని కంప్యూటర్‌లతో క్లర్కులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే యాజమాన్యం నూతన కంప్యూటర్‌లను కొనుగోలు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ తెలిపారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన కంప్యూటర్లు ప్రస్తుతం పనికి రాకుండా పోయాయన్నారు. వాటికి మరమ్మత్తుల పేరిట వేల రూపాయలు ఖర్చుచేయడం సరికాదన్నారు. వాటిస్థానంలో నూతన కంప్యూటర్‌లను కొనుగోలు చేస్తే క్లర్కులకు , ఉద్యోగులకు పనులు సులువు అవుతుందన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే వయో పరిమితి పెంపు



శ్రీరాంపూర్:సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రయ్య



మందమర్రి:పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 11: ఏఐటీయూసీ కృషితోనే వయోపరిమితి సర్క్యులర్ వెలువడిందని ఆయూనియన్ ఉప ప్రధానకార్యదర్శి కెవీరభద్రయ్య, బ్రాంచికార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా పేర్కొన్నారు. ఆర్కే5గనిపై మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. కార్మికవర్గం తమ వెంట ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్‌కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణిలో డిపెండెంటు ఉద్యోగులకు వయోపరిమితి పెంచేలా చేసిన ఘనత తమ యూనియన్‌దేనని ఏఐటీయూసీ మందమర్రి ఏరియాబ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియాకార్యదర్శి భీమనాధుని సుదర్శన్ తెలిపారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మొదటినుంచి వయోపరిమితి పెంచాలని పోరాడింది తమ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య అని తెలిపారు. వయో పరిమితి యాజమాన్యం పెంచడంతో తాముసాధించామని కొన్నిసంఘాలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో పిట్‌కార్యదర్శి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటీయూసీ నాయకులు గేట్‌మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా సెంట్రల్‌సెక్రెటరీ అక్బర్ ఆలీ, బ్రాంచ్‌సెక్రెటరీ ఆంజనేయులు, ఏరియా వైస్‌ప్రెసిడెంట్ లింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి డిపెండెంట్ల వయసు 35నుంచి 40సంవత్సరాలకు పెంచడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణస్వామి, భాస్కర్, చందు, తిరుపతి, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచిన ఘనత మాదే: ఐఎన్‌టీయూసీ

మందమర్రిటౌన్: సింగరేణిలో కారుణ్య నియామకంకింద ఉద్యోగంలో చేరే డిపెండెంట్లకు 35నుంచి40సంవత్సరాలకు పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వయోపరిమితి పెంచాలనితమ యూనియన్ సెక్రటరీజనరల్, రాష్ట్ర కనీసవేతనాల మండలి సహాయచైర్మన్ జనక్‌ప్రసాద్ ఎంతోగానే కృషి చేశారని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలిసి విన్నవించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతున్న పోస్టర్లను ఆవిష్కరించారు.

శ్రీరాంపూర్: కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమే వయో పరిమితి పెంపు అని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే6 గనిలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో బాయిబాట నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ యూనియన్ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పి సర్క్యులర్ ఇప్పించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, సిహెచ్. భీంరావు, కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి పాల్గొన్నారు.

జీఎం పోస్టులు తగ్గించడంపై ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జూన్ 11: సింగరేణిలో మైనింగ్ జీఎం పోస్టులు తగ్గించడంపై ఆందోళన చెందుతున్నట్లు అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం అన్నిగనులు, విభాగాల అధికారులు వినతిపత్రాలు అందించారు. మైనింగ్ జీఎంల పోస్టులు తగ్గించడం సరికాదన్నారు. ఉద్యోగుల సంఖ్యను లక్ష12వేల నుంచి 39 వేలకు తగ్గించినా, 30మిలియన్ టన్నుల బొగ్గు నుంచి 70మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఏ ప్రమాదం జరిగినా తమపైనే భౌతికదాడులు జరుగుతున్నాయని, తాము కూడా ప్రాణాలు కోల్పోతున్నామన్నారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నా మన్నారు. రిటైర్‌మెంట్ తరువాత కూడా కోర్టుల చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. 100మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తిచేసేందుకు నిర్ణయించుకున్న సమయంలో మైనింగ్ జీఎం పోస్టులు తగ్గించడం సరికాదన్నారు. గతంలో మాదిరిగానే 38జీఎం పోస్టులు కొనసాగించడానికి యాజమాన్యం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సీపీఆర్ఎంఎస్‌ను సవరించాలి

మందమర్రిటౌన్, జూన్ 11: సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మిక కుటుంబాల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన సీపీఆర్ఎంఎస్ విధానాన్ని సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంద నర్సింహారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులకు రూ.25 లక్షలు సీపీఆర్ఎంఎస్ కార్డుకింద చెల్లిస్తున్నారని, అదేవిధానాన్ని ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద సంవత్సరానికి రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.